విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ
- విద్యార్థులకు పోషకాహారం అందించడమే ధ్యేయం
- డెమో ద్వారా మధ్యాహ్న భోజన సిబ్బందికి అవగాహన కల్పించిన అధికారులు



పుల్లంపేట: పోటీలో గెలిచిన మధ్యాహ్న భోజన సహాయకులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు, సహాయకులకు ఎంఈఓ–2 అరుణ, డీఆర్‌పీ ప్రసాద్‌రెడ్డిలు సూచించారు. సిద్దవటం మండలం భాకరాపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వంట ఏజెన్సీల సిబ్బందికి ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం విద్యకు అడ్డుకాకూడదని, తలచిన రాష్ట్ర ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పించిందన్నారు. విద్యార్థులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలన్న ఉద్దేశంతో పాఠశాలల్లో విద్యార్థులకు మెనూను నిర్దేశించిందన్నారు. మెనూ ప్రకారం వంట ఏజెన్సీల నిర్వాహకులు విద్యార్థులకు భోజనం తప్పక అందించాలన్నారు. తిరుపతికి చెందిన తాజ్ హోటల్ చెఫ్‌లు వంట ఏజెన్సీల సిబ్బందికి డెమో ద్వారా శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు సైన్స్ పరంగా విటమిన్లు, ప్రొటీన్‌లు, పోషక విలువలు ఎందులో ఉన్నాయో వారు వివరించారు. ఎక్కువ సేపు బియ్యం నానబెట్టకూడదని, ఎక్కువ సార్లు బియ్యం కడగకూడదని సూచించారు. భోజనంతోపాటుగా విద్యార్థులకు అందించే అరటి పండు, బొప్పాయి క్యారెట్, చిక్కీలు, రాగి జావా, గుడ్లు, ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం లక్ష్మికేశమ్మ, సీఆర్‌పీలు హిమవతి, సుజాత, రాజేశ్వరి, కవిత, ఐఈఆర్టీ ఉపాధ్యాయురాలు పద్మావతి, వంట ఏజెన్సీ నిర్వాహకులు, సహాయకులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంట మనుషులకు బహుమతుల ప్రదానం

పుల్లంపేట : మంట మనుషులకు మధ్యాహ్న భోజన పథకం శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అనంతరం వంటల పోటీలు పెట్టి మొదటి మూడు స్థానాలలో నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి పొందిన వారు ఆర్.భాగ్యమ్మ, అనంతంపల్లి ప్రాథమిక పాఠశాల వంట మనిషి, ద్వితీయ బహుమతి రమణమ్మ, వి.కొత్తలూరు ప్రాథమిక పాఠశాల వంట మనిషి, తృతీయ బహుమతి ఎం.పార్వతమ్మ, వంట మనిషి, శ్రీరాములపేట ప్రాథమిక పాఠశాలలకు మండల విద్యాశాఖాధికారి డి.నాగ తిరుమలరావు, ఎంఈఓ–2 ఎం రవీంద్ర నాయక్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీవీడీ సభా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్‌రెడ్డి, కొత్తపేట హెడ్‌మాస్టర్ అనిమల కృష్ణమూర్తి, సీఆర్‌పీలు, ఐఈఆర్‌టీ విజయకుమారి, కో–ఆర్డినేటర్ శివప్రసాద్, వంట మనుషులు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ రామయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామయ్య మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించాలన్నారు. ప్రభుత్వ విధి విధానాలు అనుసరించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు భోజనం తయారు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, పక్కా భవనంలో వంటలు చేయాలని సూచించారు. అనంతరం పలు విషయాలపై మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రెడ్డయ్య, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ శంకర్, ఎంఆర్‌పీ సిబ్బంది చెంగయ్యలు పాల్గొన్నారు.



ఓబులవారిపల్లె: వంట ఏజెన్సీ నిర్వాహకులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓలు



సిద్దవటం: శిక్షణా కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న డీఆర్‌పీ ప్రసాద్‌రెడ్డి

క్లుప్తంగా

జనుము విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు రైతు భరోసా కేంద్రం నందు వ్యవసాయ అధికారిణి (ఏఓ) బి. మల్లిక, రైతు భరోసా ఇన్‌చార్జ్ డి.నందినీలు రైతులకు జనుము విత్తనాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాలకు గాను 30 క్వింటాళ్ల జనుము విత్తనాలు రావడం జరిగిందన్నారు. 10 కేజీలు జనుము విత్తనాలు పూర్తి ధర రూ. 880లు ఉండగా సబ్సిడీ పోను రూ. రూ. 440లకు రైతులకు అందజేస్తున్నామన్నారు. కావున కావాల్సిన రైతులు దగ్గరలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి జనుము విత్తనాలు పొందవలెనని ఆమె కోరారు.

కొత్తపురమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కొత్తపురమ్మ

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో వెలసిన శ్రీ కొత్తపురమ్మకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. మొక్కులు తీరిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు తరిలి వచ్చారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీ అంతం



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న పిల్లి జయప్రకాష్

రాజంపేట రూరల్ : టీబీ వ్యాధిని అంతమొందించటానికి బీసీజీ అడల్ట్ వ్యాక్సినేషన్‌ను తప్పనిసరిగా వేయించుకోవాలని టీబీ సూపర్‌వైజర్ పిల్లి జయప్రకాష్ కోరారు. పట్టణంలోని ఈడిగపాళెం, మన్నూరు, ఆర్‌ఎస్ రోడ్–1, కొలిమివీధిలో ఉన్న సచివాలయాలలో గురువారం వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న బీసీజీ అడల్ట్ వ్యాక్సినేషన్‌ను పని తీరును ఆయన పరిశీలించారు. అనంతరం టీబీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ కమీషన్ ఆదేశాల మేరకు గురువారం బీసీజీ అడల్ట్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభించామన్నారు. దాదాపు 3 నెలలపాటు ప్రతి సచివాలయంలో ప్రతి గురువారం ఈ వ్యాక్సినేషన్‌ను అందించనున్నట్లు తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన వారు, 60 సంవత్సరాలు నిండిన వారితోపాటు షుగర్ పేషెంట్లు, టీబీ పేషెంట్లు క్లోజ్ కాంటాక్స్, బీఎంఐ పేషెంట్స్ తప్పనిసరిగా వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అశోక్, కో ఆర్డినేటర్ ఉల్లంగి జగత్‌పతి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల జాగ్రత్త



పెద్ద ఓబన్న, ఎస్‌ఐ, సిద్దవటం

సిద్దవటం : ఇటీవల పలు ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్నాయని సిద్దవటం మండలంలోని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సిద్దవటం ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. రాత్రివేళల్లో పోలీసులు గస్తీలు, పెట్రోలింగ్‌లు చేస్తూ దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా జాగ్రతలను పాటించాలని ఆయన సూచించారు. ఇండ్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు ఇంట్లో ఉంచకుండా తమ వెంట తీసుకెళ్లాలని ఆయన తెలియజేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



చిన్నమండెం: వివిధ పార్టీల నేతల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ తులసీరాం

చిన్నమండెం : ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారి పైనైనా కఠిన చర్యలు తప్పవని రాయచోటి రూరల్ సీఐ తులసీరాం అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం సాయంత్రం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ కౌంటింగ్ రోజున అందరూ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని గ్రామాల్లో పార్టీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టే వ్యవహారాలు చేయరాదని హెచ్చరించారు. ఎస్‌ఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది, పలు పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ తులసీరాం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఆవేశానికి లోనై గొడవలు, అల్లర్లు సృష్టిస్తే, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అల్లర్లకు పాల్పడకుండా నాయకులు కేడర్‌కు దిశానిర్దేశం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించండి



మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్రరావు



సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు

- అల్లర్లకు పాల్పడితే జైలుకే
- డీఎస్పీ రామచంద్రరావు

రాయచోటి టౌన్ : గొడవలు, అల్లర్లు సృష్టిస్తే జైలుకు వెళ్లాల్సిందేనని డీఎస్పీ రామచంద్ర రావు హెచ్చరించారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో జూన్ 4వ తేదీ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు. ఇలాంటి సమయంలో ఎవరూ అల్లర్లకు, గొడవలకు పాల్పడరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తెలియజేశారు. అలాగే ఆయా పార్టీలకు చెందిన నాయకులు పార్టీ కార్యకర్తలకు సంయమనం పాటించే విధంగా దిశానిర్దేశం చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని నాయకులు పోలీసులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ భక్తవత్సలం, లోకేష్ వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

రాయచోటి అర్బన్ : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసేది ఒక్క సీఐటీయూనే అని ఆ సంస్థ జిల్లా కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బస్టాండ్ సర్కిల్‌లో ఆయన కార్మికులతో కలసి పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడుతూ గత 54 సంవత్సరాలుగా కార్మికులు, ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్, విద్యుత్, గ్రామసేవకుల సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. దేశంలో పెట్టుబడిదారి వ్యవస్థను కుప్పకూల్చి కార్మికరాజ్య స్థాపన చేయడమే సీఐటీయూ అంతిమ లక్ష్యమన్నారు. దేశంలో ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నది సీఐటీయూనే అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.వి.రమణ, జిల్లా కమిటీ సభ్యుడు ఫయాజ్, పలు సంఘాల నేతలు మాధవయ్య, వెంకటరమణ, బి.వి.రమణ, చంద్ర, శంకర, పద్మ, సలీం తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ పతాకావిష్కరణ చేస్తున్న రామాంజులు, కార్మికులు

కనుల పండువగా గంగ జాతర



గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న కొండూరు అజయ్‌రెడ్డి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : నల్లపురెడ్డిపల్లె గ్రామంలో గంగమ్మ జాతర గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భక్తులు గంగమ్మను దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఉదయం నుంచి భక్తులు పూజలు, పొంగుబాళ్లు నిర్వహించారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు పంజం సుకుమార్‌రెడ్డిలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి నరసారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు కె.వెంకటరెడ్డి, పి.ప్రతాప్ రెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ టోర్నమెంట్

నందలూరు : నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ రసవత్తరంగా కొనసాగుతోంది. గురువారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో గాంధీనగర్ లెవన్స్ అరవపల్లె జట్టు, వినాయక లెవన్స్ నాగిరెడ్డిపల్లె జట్టుపై విజయం సాధించింది. మొదటి బ్యాటింగ్ చేసిన గాంధీనగర్ జట్టు 14 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 171 పరుగులు చేసింది. పాల్ రాజ్ 45, ఎంఎస్ మణి 34 పరుగులు చేశారు. అనంతరం విజయం కోసం బరిలో దిగిన వినాయక జట్టు 9.4 ఓవర్లలో 72 పరుగులకు ఆలౌట్ అయ్యి పరాజయం చెందింది. గాంధీనగర్ జట్టు బౌలర్ కరణ్ 4 ఓవర్లు వేసి 17 రన్స్ ఇచ్చి ఆరు వికెట్లు తీసి విజయంలో కీలకపాత్ర పోషించి సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు రంగస్వామి చేతులమీదుగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని అందుకున్నారు.

రాజంపేట జట్టుపై మంటపంపల్లె జట్టు విజయం..

మధ్యాహ్నం ముద్దు కృష్ణ లెవన్స్ మంటపంపల్లె, రాజంపేట యాసిన్ లెవన్స్ జట్ల మధ్య మ్యాచ్ ఆసక్తిరంగా కొనసాగింది. మొదట బ్యాటింగ్ చేసిన ముద్దు కృష్ణ జట్టు 14 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. ప్రవీణ్ 36 బంతులలో 68 పరుగులు చేశాడు. అనంతరం 158 పరుగులు విజయ లక్ష్యంతో బరిగిలో దిగిన యాసిన్ జట్టు 13.1 ఓవర్లలో 77 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి పరాజయం చెందింది. రెండు ఓవర్లు వేసి 2 వికెట్లు తీయడంతోపాటు 68 పరుగులు చేసిన ప్రవీణ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను అందజేశారు.

90 శాతం సబ్సిడీతో విత్తనాలను అందజేయాలి



ఏడీఏకు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : కరువుతో అల్లాడుతున్న రైతాంగానికి ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో పంటసాగుకు విత్తనాలను అందజేయాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులను ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, ఎస్.రామచంద్రలు కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వేరుశనగ, కంది, అలసంద, ఉలవ వంటి విత్తనాలు అవసరమన్నారు. గత సంవత్సరం కరువు పరిస్థితులతో పంటలు నష్టపోయిన రైతులు ఈ యేడాది పంటల సాగుకు అవసరమైన విత్తనాలు కొనుగోలు చేసే పరిస్థితిలో లేరన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కింద కొన్ని ప్రాంతాల్లో సరఫరా చేస్తున్న వేరుశనగ విత్తనాలు నాసికరంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు అవసరమైనన్ని విత్తనాలు, ఎరువులు 90 శాతం సబ్సిడీతో అందజేయాలని కోరారు. రైతు పెట్టుబడికి అవసరమైన రుణాలను బ్యాంకుల నుంచి ఇప్పించాలన్నారు. 2023 ఖరీఫ్ నష్టానికి సంబంధించిన ఇన్సురెన్స్ మొత్తాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలోని ఏడీఏ సువర్ణకు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

వీరబల్లె : ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిణి స్వాతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలానికి ఎర్ర వేరుశనగ విత్తనకాయలు 350 క్వింటాళ్లు, తెల్ల వేరుశనగ కాయలు 250 క్వింటాళ్లు మొత్తం 600 క్వింటాళ్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. ఒక బస్తా తెల్ల వేరుశనగ విత్తనకాయలు రూ. 1710లు, అలాగే ఒక బస్తా ఎర్ర వేరుశనగ విత్తనకాయలు రూ.1746లతో అందిస్తున్నామన్నారు. ప్రతి రైతు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను తీసుకువచ్చి వేరుశనగ విత్తనాలను పొందాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ నెల్లూరు, నల్లపురెడ్డిపల్లెల్లో గంగ జాతర

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని నారాయణ నెల్లూరు, నల్లపురెడ్డిపల్లి గ్రామాలలో ప్రతిష్టాత్మకంగా గంగమ్మ జాతరను గురువారం నిర్వహించారు. పార్టీలకతీతంగా గ్రామ ప్రజలు ఈ రెండు గ్రామాలలో జాతరను నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భారీగా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రెండు గ్రామాలలో జరిగిన గంగమ్మ జాతరకు అన్ని పార్టీల నాయకులు పాల్గొనడంతో సందడి నెలకొంది. అనంతరం భక్తులు పొంగబాళ్లు ఏర్పాటు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా భావనారాయణుడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సిద్దవటం : మండలంలోని మాధవరం పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్‌లో వెలసిన శ్రీ భద్రావతి భావనారాయణస్వామి ఉత్సవ మూర్తులకు గురువారం వేద పండితులు వైభవోపేతంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తులకు అభిషేకం చేయించి పట్టు వస్త్రాలతో అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేద పండితులు కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, సహస్రనామార్చన, కంకణాధారణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు, వంటి పూజా కార్యాక్రమాలను నిర్వహించి వేద పండితులు వేద మంత్రాలతో మంగళవాయిద్యాల మధ్య కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. కొందరు భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

వ్యాక్సినేషన్‌కు సహకరించండి

చిట్వేలి : బీసీజీ వ్యాక్సిన్‌తో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని చిట్వేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు అబ్దుల్ అన్సారీ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండల వ్యాప్తంగా 226 మందికి వ్యాక్సిన్ వేయడం జరిగిందని డాక్టర్ అన్సారీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు, స్మోకింగ్ చేసేవారు, 60 సంవత్సరాలు పైబడిన వారు, టీబీతో బాధపడుతున్న వారు, 18 కేజీలు కన్నా తక్కువ బరువు ఉన్నవారు వ్యాక్సిన్ వేసుకోవచ్చన్నారు. ఇందులో భాగంగా ప్రతి గురువారం ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేస్తారన్నారు. వ్యాక్సిన్ వేసుకోవాలనుకున్న వారు ఆశా, ఏఎన్‌ఎం వద్ద పేర్లు నమోదు చేసుకొని వ్యాక్సినేషన్ ప్రక్రియను విజయవంతానికి సహకరించాలన్నారు.

రామాపురంలో..

రామాపురం : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వయోజనులు 60 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా బీసీజీ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా కో–ఆర్డినేటర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం కర్ణపువాండ్లపల్లెలో 60 సంవత్సరాలు పైబడిన బీడీ, తమ్మాకు అలవాటు ఉన్నవారికి, ఐదు సంవత్సరాల క్రితం ఇంట్లో టీబీ ఉండి 18 సంవతసరాలు పైబడిన వారికి బీపీ, షుగర్ ఉన్నవారికి బీసీజీ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని అవగాహన కల్పిస్తూ టీకాలను వేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ హరి, ఎమ్‌ఐహెచ్‌పీఎస్ శ్రావణి, ఏఎన్‌ఎమ్ నాగవేణి, రాములమ్మ, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంత్యుత్సవాలు



అలంకరణలో వీరాంజనేయుడు

సుండుపల్లె : రాయవరం గ్రామంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి వారి జయంతి సందర్భంగా స్వామివారి తిరునాల గురువారం ధ్వజారోహణం, నవగ్రహ ఆరాధన, అభిషేకాలు, అర్చనలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నేడు శుక్రవారం రుద్రాభిషేకం, అర్చనలు, నైవేద్యాలు, శనివారం ఉదయం అభిషేకం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి తదనంతరం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో చాందినీబండ్లు తిరుగుతాయన్నారు.

ప్రశాంతంగా ఆలయ భూముల కౌలు వేలం

సిద్దవటం : మండలంలోని వెంకటయాపల్లె గ్రామంలో వెలసిన అంబాపురపార్థీశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన భూముల వేలం పాటను గురువారం ఆలయ ప్రాంగణంలో ఈఓ మోహన్‌రెడ్డి, రాజంపేట ఇన్‌స్పెక్టర్ శివయ్య గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయ భూమలు కౌలుకు వేలం ప్రక్రియను నిర్వహించారు. ఆలయానికి సంబంధించిన 12.76 ఎకరాల మాగాని భూమిని వేలంలో గ్రామానికి చెందిన పలువురు దక్కించుకున్నారు. ఆలయ భూముల వేలం ద్వారా రూ. 1.20 లక్షల నగదు వచ్చింది. ఈ నగదు మొత్తాన్ని దేవస్థానం పేరిట ఉన్న బ్యాంకు అకౌంట్లో జమ చేస్తామని ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ సిబ్బంది చంద్ర, పాటాదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.